ఆంధ్రజ్యోతి

5

ANDHRAJYOTHY

అనకాపల్లి

జిల్లా వార్తలు

సోమవారం 20 మే 2024



నూకాంబిక ఆలయం కిటకిట

అనకాపల్లి నూకాంబిక ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచే బాలాలయంలోని అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులతో క్యూలైన్లు నిండిపోయాయి. ఉమ్మడి విశాఖ జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



క్యూలైన్‌లో ఉన్న భక్తులు



నూకాంబిక అమ్మవారు

రైతన్న కన్నీటి కష్టాలు

వైసీపీ అధికారంలోకి వచ్చాక సాగునీటి వనరులపై తీవ్ర నిర్లక్ష్యం

- రిజర్వాయర్లు, గ్రోయిన్లు మరమ్మతులకు గురైనా పట్టించుకోని వైనం
- ఈ ఖరీఫ్ సాగుకు కూడా నీరు అందే పరిస్థితి లేదు
- సర్కారు తీరుపై రైతుల ఆవేదన



తూటిపాల సర్పానదిలో మరమ్మతులకు గురైన గ్రోయిన్

మాకవరపాలెం, మే 19:

వైసీపీ అధికారంలోకి వచ్చాక సాగునీటి వనరులపై తీవ్ర నిర్లక్ష్యం చేసింది. దీంతో ఐదేళ్లుగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఖరీఫ్ సాగుకు కూడా నీరు అందే పరిస్థితులు కనిపించడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

గత ఐదేళ్లుగా రిజర్వాయర్లు, గ్రోయిన్లు మరమ్మతులకు నోచుకోకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని తూటిపాల గ్రామంలో ఉన్న సర్పానది గ్రోయిన్ మరమ్మతులకు గురై ఐదేళ్లు కావస్తున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో ఐదేళ్లుగా సుమారు 300 ఎకరాలకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురిస్తే తప్ప ఈ ప్రాంతంలో వరిసాగు పండడం లేదని రైతుల వాపోతున్నారు. నీటి వసతుల నిర్వహణ లేకపోవడం వల్ల ఖరీఫ్‌లో వరిసాగు పూర్తిగా ఎండిపోయి తీవ్రంగా నష్టపోతున్నామని చెబుతున్నారు. మామిడిపాలెంలో రిజర్వాయర్ ఉన్నప్పటికీ గేట్లు మరమ్మతులకు నోచుకోవడంతో నీరు నిల్వ ఉండడం లేదని రైతులు అంటున్నారు. అలాగే రిజర్వాయరులో పూడిక పెరిగిపోవడంతో ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న నీరు వచ్చింది వచ్చినట్టే బయటకు పోతోందని ఆవేదన చెందుతున్నారు. దీంతో ఇక్కడ సుమారు 300 ఎకరాలకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారిందని రైతులు చెబుతున్నారు. రిజర్వాయరు కింద ఉన్న ఆయకట్టు భూముల్లో సరుగుడు తోటలు వేసుకోవలసి వస్తోందని చెబుతున్నారు. ఈ రిజర్వాయరు గేట్లకు మరమ్మతులు చేసి ఈ ఖరీఫ్‌కి సాగునీరు అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.



మామిడిపాలెంలో మరమ్మతులకు గురైన రిజర్వాయర్ గేట్లు

గోవాడలో ఉద్రిక్తత

ఉపాధి కూలీలను రెచ్చగొట్టిన వైసీపీ నాయకులు

- టీడీపీ నాయకుడి ఇంటి వద్ద కూలీల ఆందోళన
- ఘర్షణ వాతావరణం నెలకొనడంతో పోలీసుల జోక్యం
- ఇరువర్గాలు పరస్పరం ఫిర్యాదులు

చోడవరం, మే 19:

మండలంలోని గోవాడలో ఆదివారం మధ్యాహ్నం ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఉపాధి కూలీలను వైసీపీ నాయకులు రెచ్చగొట్టడంతో వారంతా టీడీపీ నాయకుడి ఇంటి వద్ద ఆందోళనకు దిగారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనుల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయని, దీనిపై సమగ్ర విచారణ జరపాలంటూ స్థానిక టీడీపీ, జనసేన నాయకులు ఏడువాక లక్ష్మణ్ కుమార్, ఏడువాక శ్రీనివాసరావులు శనివారం పత్రికాపరంగా ఆరోపణలు చేశారు. ఈ విషయం పత్రికల్లో ఆదివారం వచ్చింది. ఈ నేపథ్యంలో స్థానిక వైసీపీ నేతలు ఉపాధి కూలీలను ఆదివారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్దకు పిలిపించారు. టీడీపీ, జనసేన నాయకులు ఉపాధి పనులపై తప్పుడు ఆరోపణలు చేశారని, దీని వల్ల ఉపాధి పనులు ఆగిపోయే ప్రమాదం ఉందని చెప్పడంతో ఉపాధి కూలీలు స్థానిక టీడీపీ నాయకుడు ఏడువాక లక్ష్మణ్‌కుమార్ ఇంటి వద్ద ఆందోళనకు దిగారు. మీ వల్లే ఉపాధి పనులు ఆగిపోతున్నాయని, అనవసరంగా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని లక్ష్మణ్‌కుమార్‌తో కూలీలు గొడవ పడ్డారు. ఈ విషయం ... మిగతా 8వ పేజీలో



టీడీపీ నాయకులతో చర్చలు జరుపుతున్న సీఐ శ్రీనివాసరావు



గోవాడలో టీడీపీ నేతలు, ఉపాధి కూలీల మధ్య వాగ్వాదం జరుగుతున్న దృశ్యం

ఎన్నికల ఫలితాల వేళ మరింత అప్రమత్తం

- ఎగ్జిట్ పోల్స్ వచ్చేటప్పుడు కూడా..
- అధికారులకు ఎస్పీ మురళీకృష్ణ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి రూరల్, మే 19:

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఎగ్జిట్ పోల్స్, నాల్గో తేదీన ఎన్నికల ఫలితాలు రానున్న సందర్భంగా జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మురళీకృష్ణ ఆదేశించారు. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే నెల ఒకటి నుంచి ఐదో తేదీ వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలను రెచ్చగొట్టే సందేశాలు, నిరాధార ఆరోపణలు తదితర వాటిని సామాజిక మాధ్యమాల వేదికపై ప్రచారం చేయకూడదని, అలా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనుమతులు లేని ర్యాలీలు, ఊరేగింపులు, సమావేశాలు, బాణసంచా పేల్చడం నిషేధమని గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. అలాంటివి ప్రోత్సహించి, నిర్వహించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ విజయభాస్కర్, డీఎస్పీ అప్పలరాజు, సీఐ నమ్మి గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులేవి?

పల్లె వెలుగు, మెట్రో బస్సులకే ఎలమంచిలి బస్టాండ్ పరిమితం

- విజయవాడ నుంచి వచ్చే ప్రయాణికులు అనకాపల్లికి టికెట్ తీసుకుని ఎలమంచిలి బైపాస్ రోడ్డులో దిగాల్సిన దుస్థితి
- ఫ్లైఓవర్ ప్రారంభమైనా తప్పని కష్టాలు
- నెరవేరని నేతల హామీలు



పల్లె వెలుగు, మెట్రో బస్సులకే పరిమితమైన ఎలమంచిలి ఆర్టీసీ బస్టాండ్



అనకాపల్లికి చార్జీ చెల్లించి ఎలమంచిలిలో దిగిన ప్రయాణికుడి బస్సు టికెట్

ఎలమంచిలి, మే 19:

ఎలమంచిలి పట్టణ ప్రజలకు ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులు అందుబాటులో లేకుండాపోయాయి. కేవలం పల్లె వెలుగు, మెట్రో బస్సు సర్వీసులకే స్థానిక ఆర్టీసీ బస్టాండ్ పరిమితమైంది. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు అనకాపల్లికి టికెట్ తీసుకుని ఎలమంచిలి బైపాస్ రోడ్డులో దిగాల్సిన దుస్థితి నెలకొంది.

ఎలమంచిలి పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్నా ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులకు మాత్రం నోచుకోవడం లేదు. ఎలమంచిలి ఆర్టీసీ బస్టాండ్ వైపు ఎక్స్‌ప్రెస్ బస్సులు కన్నెత్తి చూడకపోవడంతో ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు కుటుంబ సమేతంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విజయవాడ నుంచి వచ్చే ప్రయాణికులు ఎలమంచిలికి హాల్ట్ లేకపోవడంతో రూ.600 చెల్లించి అనకాపల్లికి టికెట్ తీసుకుంటున్నారు. ఎలమంచిలి బైపాస్ రోడ్డులో బస్సు దిగి ఆటోల్లో పట్టణానికి వస్తున్నారు. సుమారు కిలోమీటరున్నర దూరం ఉండడంతో ఆటో డ్రైవర్లు అధిక చార్జీలు వసూలు చేస్తున్నారు. గత్యంతరం లేక అడిగినంత ఇచ్చి గమ్యస్థానానికి చేరుకుంటున్నారు.

ఫ్లైఓవర్ బ్రిడ్జి అందుబాటులోకి వచ్చినా..

ఎలమంచిలి బస్టాండ్‌కు సుమారు ఏడేళ్ల క్రితం 40కి పైగా ఎక్స్‌ప్రెస్ బస్సులు వచ్చేవి. దీంతో ఎలమంచిలి నుంచి ఇతర ప్రాంతాలకు సునాయాసంగా రాకపోకలు ... మిగతా 8వ పేజీలో

రారెత్తించిన ఎండలు

అల్లాడిన జనం



నిర్మానుష్యంగా ఉన్న పరవాడ ప్రధాన రహదారి

అనకాపల్లి రూరల్, మే 19:

జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఎండలు మండిపోయాయి. ఉదయం ఎనిమిది గంటల నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపించాడు. దీంతో వృద్ధులు, చిన్నారులు అల్లాడిపోయారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు బయటకు రావడానికి హడలిపోయారు. ఎండ తీవ్రతకు ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. జిల్లాలో అత్యధికంగా రావికమతం, ఎస్.రాయవరం మండలాల్లో 38.7 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యల్పంగా బుచ్చెయ్యపేట, కె.కోటపాడు మండలాల్లో 30.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అనకాపల్లిలో 30.5 డిగ్రీలు, అచ్యుతాపురం 34.8, బుచ్చెయ్యపేట 30.2, చీడికాడ 37.5, చోడవరం 37.5, దేవరాపల్లి 34.1, గొలుగొండ 34.9, కె.కోటపాడు 30.2, కశింకోట 34.9, కోటవురట్ల 35.3, మాడుగుల 38.1, మాకవరపాలెం 37.7, మునగపాక 36.9, నక్కపల్లి 36.0, నర్సీపట్నం 38.2, నాతవరం 38.2, పరవాడ 38.2, పాయకరావుపేట 38.1, రాంబిల్లి 35.9, రావికమతం 38.7, రోలుగుంట 37.2, ఎస్.రాయవరం 38.7, సబ్బవరం 37.5, ఎలమంచిలిలో 35.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

అటకెక్కిన పేట అభివృద్ధి

- నాలుగేళ్లుగా సాగుతున్న పంచాయతీ భవన నిర్మాణం
- అతీగతీలేని మెయిన్ రోడ్డు సెంట్రల్ లైటింగ్ సిస్టమ్
- ప్రతిపాదనలకే పరిమితమైన 'తాండవ' రక్షణ గోడ
- అభివృద్ధికి నోచుకోని అంబేడ్కర్ పార్కు

- వార్త 7వ పేజీలో..

దీర్ఘకాలిక వ్యాధులపై ఇంటింటి సర్వే

జూలై నుంచి చేపట్టేందుకు ఆరోగ్యశాఖ ఏర్పాట్లు

- ఇప్పటికే జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ ఆఫీసర్లకు ముగిసిన తర్ఫీదు
- త్వరలో సిబ్బందికి అందనున్న శిక్షణ

విశాఖపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి):

దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారిని గుర్తించేందుకు వీలుగా మరోసారి ఇంటింటి సర్వే చేపట్టేందుకు వైద్య ఆరోగ్యశాఖ సన్నద్ధమవుతోంది. గతంలో నాన్ కమ్యూనికబుల్ డిసీజ్ (ఎన్‌సీడీ), ఎన్‌సీడీ 2.ఓ పేరుతో సర్వే నిర్వహించిన ఆరోగ్యశాఖ.. మరో విడత ఇంటింటి సర్వేకు సిద్ధమవుతోంది. ఎన్‌సీడీ 3.ఓ పేరు జూలై మొదటి వారం నుంచి ఈ సర్వేను చేపట్టనుంది.

ఇంటింటి సర్వేలో భాగంగా 18 ఏళ్లు పైబడిన వారి ఆరోగ్య వివరాలను సేకరించనున్నారు. బీపీ, షుగర్, ఆస్టియో ఆర్థరైటిస్ వంటి వ్యాధులతోపాటు కేన్సర్‌కు స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించేందుకు రంగం సిద్ధమవుతోంది. రొమ్ము, సర్వైకల్, ఓరల్ కేన్సర్ నిర్ధారణకు సంబంధించి ఆరోగ్యశాఖ సిబ్బంది రోగుల ఇళ్ల వద్దే స్ర్కీనింగ్ చేపట్టనున్నారు. ఆరోగ్యశాఖకు చెందిన మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్, ఏఎన్ఎం ఆధ్వర్యంలో సర్వే నిర్వహిస్తారు. రోగుల వివరాలను వీరికి కేటాయించిన యాప్‌లో పొందుపరుస్తారు. ఆయా గ్రామాల కు కేటాయించిన పీహెచ్‌సీలోని వైద్యులు (ఫ్యామిలీ ఫిజీషి యన్ కాన్సెప్ట్) రోగులు వివరాలను పరిశీలించి, అవసరమ నుకుంటే మెరుగైన పరీక్షలు, వైద్య సేవలు అందించేందుకు అనుగుణంగా రిఫరల్ ఆస్పత్రులకు, ఆరోగ్యశాఖ నెట్‌వర్క్ ఆస్పత్రులకు తరలించనున్నారు.



హెల్త్ సర్వే నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్ ఫొటో)

త్వరలో సిబ్బందికి శిక్షణ

ఎన్‌సీడీ 3.ఓ సర్వే నిర్వహణకు సంబంధించి జిల్లా స్థాయి లో ఒక అధికారి ఇప్పటికే శిక్షణ తీసుకుని వచ్చారు. వీరి ఆధ్వర్యంలో జిల్లాలో సర్వే నిర్వహించనున్న ఆరోగ్యశాఖ సిబ్బందికి శిక్షణ అందిస్తారు. ఈ నెలాఖరులోగా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించే సిబ్బందికి శిక్షణ పూర్తి చేయనున్నట్టు ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. ఎన్‌సీడీ 3.ఓ సర్వేలో పూర్తిగా కేన్సర్‌కు సంబంధించిన అంశాలపై దృష్టిసారిస్తారు. ప్రపంచవ్యాప్తంగా కేన్సర్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నక్కపల్లి, మే 19: మండలంలోని వేంపాడు టోల్‌ప్లాజా సమీపాన శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా, మరొకరు గాయపడినట్టు పోలీసులు తెలిపారు. గుంటూరు జిల్లా ఏటి అగ్రహారం, ఫాతిమా నగర్‌కు చెందిన కంతటి నవీన్ (21), అతని స్నేహితుడు వంశీ కృష్ణ (17) ఈనెల 17న బైక్‌పై అరకు వెళ్లారు. శనివారం రాత్రి వారు బైక్‌పై తిరిగి గుంటూరు వెళుతుండగా 11 గంటలకు టోల్‌ప్లాజా వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొన్నట్టు పోలీసులు చెప్పారు. దీంతో నవీన్ అక్కడికక్కడే మృతి చెందగా, గాయపడిన కృష్ణను తుని తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదస్థితిలో వడ్డాది వ్యక్తి మృతి

- అదృశ్యమైన ఐదు రోజుల తర్వాత అంబేరుపురంలో చెట్టుకు వేలాడుతూ కనిపించిన మృతదేహం


గనిశెట్టి నానాజీ (ఫైల్)

చోడవరం, మే 19 : అదృశ్యమైన బుచ్చెయ్యపేట మండలం వడ్డాదికి చెందిన గనిశెట్టి నానాజీ (38) మృతదేహం చెట్టుకొమ్మకు వేలాడుతూ ఉండడం కలకలం రేపింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఐదు రోజుల క్రితం నానాజీ ఇంటి నుంచి బయటకు వచ్చాడు. నాటి నుంచి కనిపించలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి ఇతని కోసం బంధువులు వెతకడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఇదే మండలం అంబేరుపురం వెంకన్నపాలెం సరిహద్దులో ఉన్న చెరువు సమీపంలో గల తుప్పల్లో బొడ్డ చెట్టుకు వేలాడుతూ ఉన్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. దీనిపై వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి విచారణ జరపగా వడ్డాది గ్రామానికి చెందిన గనిశెట్టి నానాజీగా నిర్ధారణ జరిగింది. నానాజీ కొంతకాలంగా మానసిక సమస్యలతో బాధపడుతున్నాడని, ఈ కారణంతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని అతని కుటుంబ సభ్యులు భావిస్తున్నట్టు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. కాగా ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నానాజీ మృతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు. మృతదేహం బాగా కుళ్లిపోయి ఉండడంతో ఆయన వేసుకున్న దుస్తులు ఆధారంగా గుర్తించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించామన్నారు.

10 మద్యం క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం

కొత్తూరు, మే 19 : మండలంలోని కోడూరు గ్రామ శివారులో 10 మద్యం క్వార్టర్ బాటిళ్లు తరలిస్తున్న మహిళపై కేసు నమోదు చేసినట్టు అనకాపల్లిరూరల్ పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఎస్‌డీఎస్‌కే.రాజు తెలిపారు. అక్రమంగా మద్యం తరలిస్తున్న తలారి వరహాలమ్మను అదుపులోకి తీసుకొని మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఆయన చెప్పారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు

- చివరి రోజు చూపరులను కట్టిపడేసిన 'ఓ కాశీవాసి రావయ్యా', 'మనఃసాక్షి' నాటికలు


ఓ కాశివాసి రావయ్యా నాటికలో ఓ సన్నివేశం

కొత్తూరు, మే 19 : అనకాపల్లిలోని వీవీ రమణ రైతు భారతి ఓపెన్ ఆడిటోరియంలో జ్యోతి సరళ స్మారక కళాపరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు ఆదివారం ముగిశాయి. పరిషత్ నిర్వాహకుడు పీసీహెచ్. నాయుడు, కేఎం నాయుడుల పర్యవేక్షణలో ఆదివారం జరిగిన విశాఖపట్నం కాలాభినయ కళాకారులు ప్రదర్శించిన "ఓ కాశివాసి రావయ్యా", విజయవాడ హర్ష క్రియేషన్స్ కళాకారులు ప్రదర్శించిన "మనఃసాక్షి" నాటికలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

'ఓ కాశీవాసీ రావయ్యా' నాటిక

మానవత్వపు విలువలు లోపిస్తున్న ఈ సమాజంలో ఎవరికి వాళ్లే కొరివి పెట్టుకునే రోజు వస్తుందని, రేపటి రోజును ఈ రోజే ఊహించి రాసిన నాటిక ఇది. సారయ్య తన భార్య నూకాలుతో ఆ ఊరి శ్మశానంలో కాటికాపరి వృత్తి చేస్తుంటాడు. ఒక రోజు ఆనందరావు అనే ఒక పెద్ద మనిషి శ్మశానానికి వచ్చి తన స్నేహితుడి శవం వస్తుందని, దానికి కావలసిన ఏర్పాట్లు చేయమని చెప్పాడు. దానికి కావలసిన డబ్బును, సారయ్య కాశీకి వెళ్లడానికి కావలసిన ధనాన్ని ఇస్తాడు. సారయ్య తాగడానికి ఊళ్లోకి వెళతాడు. అతను వచ్చేసరికి శ్మశానంలో శవం కాలుతూ ఉంటుంది. అది ఆనందరావు శరీరమని తెలిసి హతాశునౌతాడు. ఇంతలో పోలీసు అక్కడకొచ్చి అక్కడ దొరికిన ఆధారాలను బట్టి, సారయ్య మీద హత్యానేరం మోపుతాడు. భార్యాభర్తలిద్దరూ లబోదిబోమంటారు. అంతలో ఆనందరావు కొడుకు, కోడలు అక్కడికొచ్చి, ఆనందరావు పర్సు, క్రెడిట్ కార్డ్స్, గోల్డ్ మిస్సవ్వలేదని ఆనందపడతారు. వారి మాటల్లో ఆనందరావుకు భార్య పోయిందని, కొడుకు కోడలుతో ఉంటున్నాడని తెలుస్తుంది. తండ్రీ కొడుకుల్ని విడదీయడానికి కోడలు శతధాప్రయత్నించి, చివరకు మావయ్య తనను కోరుకుంటున్నాడని భర్తతో చెబుతుంది. దానితో మనసు విరిగిపోయిన ఆనందరావు పై విధంగా కాలిపోతాడు. ఆయన రాసిన ఉత్తరంతో, తన మరణానికి ఎవరూ కారకులు కారని తెలపడంతో కేసు లేకుండా పోతుంది. ఆనందరావు చివరి కోరికగా ఆయన అస్థికలు తీసుకుని, కాశీకి ప్రయాణమవుతారు సారయ్య, నూకాలు.

'మనఃసాక్షి' నాటిక

ప్రతి మనిషికి మనఃసాక్షి ఉంటుంది. అది కుటుంబ సంస్కారాలు, సంప్రదాయాల వలన రూపుదిద్దుకుంటుంది. కానీ చంద్రశేఖర పాత్ర తన మనఃసాక్షికి భిన్నంగా ధనార్జనే జీవిత ధ్యేయంగా అక్రమంగా సంపాదిస్తుంటాడు. అదే డబ్బు కోసం తన కొడుకు తండ్రి పంథాలో నడిచి తనకి కీడు చేస్తాడు. చంద్రశేఖరం పశ్చాతపడి డబ్బు శాశ్వతం కాదని నిర్ణయానికి వస్తాడు. మనిషికి కావాల్సింది పిడికెడు మెతుకులు బారెడుగుడ్డ, ఆరడుగులు నేల మాత్రమే మనిషికి శాంతినిస్తుందనే సందేశాన్ని తెలిపేది 'మనఃసాక్షి' నాటిక. ఈ నాటికకు రచన కీర్తిశేషులు డాక్టర్ పి.బ్రహ్మానందరావు, దర్శకత్వం కత్తి శ్యాం ప్రసాద్ వహించారు.


మనఃసాక్షి నాటికలో ఓ సన్నివేశం

అప్పన్న దర్శన వేళల్లో స్వల్ప మార్పులు

సింహాచలం, మే 19: వరాహలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో ఆదివారం నుంచి ప్రారంభమైన విశిష్టాద్వైత మత ప్రచారకులు నమ్మాళ్వార్ తిరు నక్షత్ర పూజలను పురస్కరించుకుని ఈనెల 23 వరకు రాత్రి 7 గంటల వరకు మాత్రమే భక్తులకు దర్శనాలు లభిస్తాయని ఈఓ శ్రీనివాసమూర్తి తెలిపారు. ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 22న నృసింహ జయంతి సందర్భంగా సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే స్వామివారి దర్శనాలు లభిస్తాయని, ఆయా రోజుల్లో రాత్రి ఆరాధన టికెట్లు రద్దు చేసినట్టు ఆయన చెప్పారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	138.00
లైవ్ ధర	158.00
విత్ స్కిన్	286.00
స్కిన్ లెస్	296.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

అటకెక్కిన పేట అభివృద్ధి


నీలం తుఫాను సమయంలో వరద నీటికి ముంపు బారిన పడిన పాయకరావుపేట(ఫైల్ ఫొటో)

- నాలుగేళ్లుగా సాగుతున్న పంచాయతీ భవన నిర్మాణం
- అతీగతీలేని మెయిన్ రోడ్డు సెంట్రల్ లైటింగ్ సిస్టమ్
- ప్రతిపాదనలకే పరిమితమైన 'తాండవ' రక్షణ గోడ
- అభివృద్ధికి నోచుకోని అంబేడ్కర్ పార్కు


శ్లాబు దశలో ఆగిపోయిన పంచాయతీ కార్యాలయ భవనం

పాయకరావుపేట, మే 19: పాయకరావుపేటలో అభివృద్ధి అటకెక్కింది. ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టణ అభివృద్ధిని గాలికొదిలేసింది. గత ఐదేళ్లలో ప్రధాన సమస్యలు ఒక్కటి కూడా పరిష్కారం కాకపోగా.. చేపట్టిన అభివృద్ధి పనులు ప్రజల అవసరాలను తీర్చలేకపోతున్నాయి.

నాలుగేళ్లుగా పూర్తి కాని పంచాయతీ భవనం

పాయకరావుపేట పంచాయతీ కార్యాలయ భవనం శిథిల స్థితికి చేరుకోవడంతో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పాత భవనాన్ని తొలగించి పంచాయతీ కార్యాలయం, సచివాలయం-1 భవన నిర్మాణాన్ని నాలుగేళ్ల క్రితం చేపట్టారు. అయితే బిల్లుల చెల్లింపులో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేయడంతో ఇప్పటికీ శ్లాబ్ స్థాయిలోనే భవనం ఉండిపోయింది. దీంతో పంచాయతీ కార్యాలయం నాలుగేళ్లుగా స్థానిక రాజుగారిబీడులోని అద్దె భవనంలోని ఇరుకు గదుల్లో కొనసాగుతోంది. పంచాయతీ పాలకవర్గ సమావేశాలు, గ్రామసభలు నిర్వహించేందుకు స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు.

మెయిన్‌రోడ్డు సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌కు మోక్షమెప్పుడో?

పాయకరావుపేటలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి 2018లో టీడీపీ హయాంలో రూ.6.3 కోట్లతో చేపట్టిన మెయిన్‌రోడ్డు విస్తరణతో పాటు సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ పనులు రోడ్డు మార్జిన్ వర్తకుల కోర్టులో వ్యాజ్యం వేయడంతో నిలిచిపోయిన విషయం తెలిసిందే. తాను గెలిస్తే రోడ్డు మార్జిన్ వర్తకుల సమస్య పరిష్కరించి, ఒక్క ఏడాదిలో మెయిన్‌రోడ్డు విస్తరణ చేస్తానని హామీ ఇచ్చి 2019 ఎన్నికల్లో విజయం సాధించిన గొల్ల బాబూరావు నాలుగేళ్ల వరకు పట్టించుకోలేదు. అయితే ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో గతేడాది రూ.2 కోట్లతో మెయిన్‌రోడ్డుపై గోతులు పూడ్చి రోడ్డు విస్తరణ చేపట్టకుండా పునర్నిర్మాణం చేశారు. దీంతో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు అటకెక్కింది. కనీసం రోడ్డు ఆక్రమణలు తొలగించి విస్తరణ కూడా చేయని కారణంగా ట్రాఫిక్ సమస్య యథాతథంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.


విస్తరణ, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు లేకుండా కేవలం పునర్నిర్మించిన మెయిన్‌రోడ్డు

ఊసేలేని 'తాండవ' రక్షణ గోడ నిర్మాణం

పట్టణాన్ని ఆనుకుని ప్రవహిస్తున్న తాండవ నది వరదల సమయంలో ఉధృతంగా ప్రవహిస్తూ పట్టణాన్ని ముంచెస్తుండడంతో రక్షణ గోడ నిర్మాణం చేపట్టాలని దశాబ్దం క్రితం నిర్ణయించినా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. ఇందు కోసం అధికారులు ఏటా ప్రతిపాదనలు పంపడమే కాని నిధులు విడుదల కాలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సుమారు రూ.72 కోట్లతో ప్రతిపాదనలు పంపినా ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. దీంతో తాండవ నదికి వరదలు వస్తున్న ప్రతిసారి పట్టణంలో రెండు కిలోమీటర్లున్న నది పరివాహక ప్రాంతంలో నివాసితులతో పాటు పట్టణ ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

నిర్వహణ లేని అంబేడ్కర్ పార్కు

ఎస్సీ నియోజకవర్గ కేంద్రమైన పాయకరావుపేటలో డాక్టర్ అంబేడ్కర్ పేరు మీద ఉన్న పార్కు ఎన్నో ఏళ్లగా నిర్వహణ లేక కనీస అభివృద్ధికి నోచుకోలేదు. విరిగిన బొమ్మలు, తుప్పలతో చిట్టడవిగా దర్శనమిస్తున్న పార్కు గురించి పట్టించుకునే నాథులే కరువయ్యారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పార్కు అభివృద్ధి చెందుతుందని పట్టణ ప్రజలు భావించారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పూర్తయినా కనీసం పట్టించుకోకపోవడం గమనార్హం.

భక్తులతో కిటకిటలాడిన నూకాంబిక ఆలయం


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


ఘటాలతో ఆలయానికి చేరుకున్న భక్తులు

అనకాపల్లి టౌన్, మే 19: స్థానిక నూకాంబిక ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజామున ఆరు గంటలకు ఆలయ అర్చకులు బాలాలయంలోని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం నుంచే అమ్మవారి ఆలయానికి వచ్చే రహదారులు భక్తులతో సందడిగా మారాయి. క్యూలైన్ లు అన్ని నిండిపోయాయి. ఉమ్మడి విశాఖ జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే చాలా మంది భక్తులు అమ్మవారి పండగను చేసుకుని ఘటాలతో ఆలయానికి వచ్చి అమ్మవారికి ఘటాలు సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. అలాగే ఆలయ ఆవరణలో భక్తులు వంటలు తయారుచేసుకుని అమ్మవారికి నైవేద్యం పెట్టి కుటుంబసమేతంగా అందరూ కలిసి భోజనాలు చేశారు.

ఉష్ణోగ్రత కారణంగా ఆలయంలోని భక్తులకు ఆలయ అధికారులు చల్లటి మంచినీటిని క్యూలో ఉన్న వారికి అందజేశారు. అలాగే స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కూడా చలివేంద్రాలు ఏర్పాటు చేసి భక్తులకు చల్లటి మజ్జిగ, మంచినీటిని పంపిణీ చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది చర్యలు తీసుకున్నారు. అలాగే ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అధ్వానంగా పంట కాలువలు

- యల్లయ్య, చెర్లోపలి కాలువల్లో పేరుపోయిన పూడిక
- దుర్వాసనతో అనకాపల్లి పట్టణవాసులు ఇక్కట్లు
- పట్టణంలో దోమలు స్వైరవిహారం
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు


నాగులాపల్లి పంట కాలువలో పేరుకుపోయిన చెత్త


యల్లయ్య కాలువలో పేరుకుపోయిన చెత్త, తుప్పలు

అనకాపల్లి టౌన్, మే 19 : పట్టణ నడిబొడ్డున ఉన్న సాగునీటి పంట కాలువలు అధ్వానంగా మారాయి. యల్లయ్య చెర్లోపలి కాలువల్లో చెత్తా చెదారం పేరుకుపోవడమే కాకుండా పలుచోట్ల పిచ్చి మొక్కలు మొలవడంతో కాలువల స్వరూపమే మారిపోయాయి. శారదా నదిలో గ్రోయిన్లు దెబ్బతినడం కారణంగా నదిలోంచి ఈ పంట కాలువల ద్వారా రైతాంగానికి సాగునీరందని పరిస్థితి నెలకొంది. గత కొన్నేళ్లుగా పట్టణవాసుల వాడుక నీరే ఈ కాలువలో ప్రవహిస్తున్నది. కాలువల్లో పలుచోట్ల ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో నీటి ప్రవాహం కూడా అంతంత మాత్రంగానే ఉంది. వాస్తవానికి ఈ సాగునీటి కాలువల ద్వారా రైతాంగం పండించే పంటలకు నీటిని అందించే బాధ్యత నీటిపారుదల శాఖదే. అయితే పట్టణ నడిబొడ్డున కాలువలు ఉండడం, ఈ కాలువలకు ఆనుకుని కొన్నేళ్ల క్రితం మున్సిపాలిటీ నీరు పోయేందుకు కాలువలను ఏర్పాటు చేసింది. మొత్తం నీటి ప్రవాహం అంతా ప్రజల వాడుకనీటితో ఉన్నందున సాగునీటి కాలువల నిర్వహణ బాధ్యతలు జీవీఎంసీకే నీటిపారుదల శాఖ అధికారులు అప్పగించారు. అప్పటి నుంచి జీవీఎంసీ వారే ప్రతి ఏటా కాలువల్లో పూడికతీత పనులు, శుభ్రతకు చర్యలు చేపడుతున్నారు. అయితే గత కొంతకాలంగా కాలువల్లో పూడిక తీయకపోవడం, పరిశుభ్రతకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో కాలువలు దుర్భరంగా మారాయి. గతేడాది చివరలో కాలువల్లో పూడికతీత పనులు మమ అనిపించారనే ఆరోపణలు ఉన్నాయి. అనువైన కొన్నిచోట్ల మాత్రమే పూడికలు పూర్తిస్థాయిలో తీసి మిగిలిన చోట్ల నామమాత్రంగా తీశారనే విమర్శలు లేకపోలేదు. ఆరు నెలలకు ఒకసారి కాలువల్లో పేరుకుపోయిన పూడికలు తీయాలని, కానీ జీవీఎంసీ అధికారులు అలా చేయడం లేదని రైతుసంఘాల నాయకులు చెబుతున్నారు. కాలువలకు ఆనుకుని ఉన్న నివాసితులు దుర్వాసన భరించక తప్పడం లేదు. అలాగే మురుగునీరు నిల్వ ఉండడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇప్పటికైన అధికారులు స్పందించి అధ్వానంగా ఉన్న పంట కాలువల్లో పూడికలు తీసి కాలువలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని పలువురు కోరుతున్నారు.

ఉదయం ఎండ వాత.. సాయంత్రం కుండపోత..!

- పలు మండలాల్లో విభిన్న వాతావరణం


ఎండ ధాటికి వెలవెలబోయిన కె.కోటపాడులోని ప్రధాన రహదారి


సాయంత్రం రావికమతం మండలం కొమిర గ్రామంలో వర్షం

రావికమతం/కె.కోటపాడు, మే 19: ఓ వైపు వేసవి కారణంగా భానుడు ఉగ్రరూపం చూపుతుండగా, మరో వైపు వరుణుడు కరుణిస్తున్నాడు. ఫలితంగా ఉదయం నుంచి ఉష్ణతాపం, సాయంత్రం నుంచి చల్లని వాతావరణం ఏర్పడుతోంది. గత కొద్ది రోజులుగా మండలంలో ఇదే పరిస్థితి నెలకొంటోంది. ఇటీవల కాలంలో అడపాదడపా వర్షాలు కురుస్తున్నప్పటికీ మే నెల, అందునా అగ్ని కార్తెలు కావడంతో ఎండలు మండుతున్నాయి. ఈ విభిన్న వాతావరణంతో అంతగా ఉక్కపోత లేకపోవడంతో జనం కాస్త ఉపశమనం పొందుతున్నారనే చెప్పాలి. వ్యవసాయ పనులకు సైతం తాజా వర్షాలు దోహదపడతాయని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుంటే, కె.కోటపాడు మండలవాసులు ఎండ తీవ్రతకు అల్లాడిపోతున్నారు. రెండుమూడు రోజుల క్రితం వర్షాలు కురవడంతో కాస్త ఉపశమనం పొందారు. అయితే ఆదివారం ఉదయం నుంచి ఎండ మండింది. సాయంత్రం ఆకాశంలో మేఘాలు కమ్ముకోవడంతో చల్లబడింది. ఎండ కారణంగా నిత్యం రద్దీగా ఉండే కె.కోటపాడు మూడురోడ్ల జంక్షన్‌లోని ప్రధాన రహదారి వెలవెలబోయింది.

శ్మశానవాటిక స్థలం కబ్జాకు యత్నం!

ట్రాక్టర్‌తో దున్నేసిన అక్రమార్కులు

- ప్రశ్నించిన రామచంద్రపురం గ్రామస్తులు
- ఫలితం లేకపోవడంతో అధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధం


రామచంద్రపురంలో శ్మశానవాటిక స్థలాన్ని దున్నుతున్న ట్రాక్టర్

కృష్ణాదేవిపేట, మే 19: ఆక్రమణకు కాదేదీ అనర్హం అన్న నానుడిని కొందరు అక్రమార్కులు నిజం చేసి చూపుతున్నారు. ఇందుకు గొలుగొండ మండలంలోని లింగంపేట పంచాయతీ శివారు గ్రామంలో జరుగుతున్న తంతే ఉదాహరణ. ఇక్కడి రామచంద్రపురం గ్రామంలో గల శ్మశానవాటిక స్థలంపై కొందరు కన్నేశారు. ఇందులో భాగంగా ఆదివారం సదరు స్థలాన్ని ట్రాక్టర్‌తో దున్ని తమ గుప్పెట్లోకి తెచ్చుకునే ప్రయత్నాలను ఆరంభించారు. సమీపంలోని తాళ్ళచీడికాడ గ్రామానికి చెందిన కొంత మంది ఇందుకు పాల్పడుతున్నారన్న వాదన వినిపిస్తోంది. దీనిపై గ్రామస్థులు అడగ్గా తిరగబడడంతో చేసేది లేక రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు. ఈ స్థలంలో ప్రభుత్వం చేతిబోరు వేయించడంతో పాటు గ్రామానికి 38సెంట్లు స్థలాన్ని శ్మశానవాటిక కోసం మంజూరు చేస్తున్నట్టు గతంలో పట్టా కూడా మంజూరు చేసింది ఈ ఆక్రమణ యత్నంపై మండల అధికారులు తక్షణమే స్పందించాల్సిందిగా గ్రామ ఉప సర్పంచ్, జనసేన నాయకుడు లంక సత్యనారాయణ కోరారు. లేనిపక్షంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు.

గ్రామీణ ఓటర్లలో చైతన్యం

- 17 పోలింగ్ కేంద్రాల్లో 90 శాతానికి పైగా ఓటింగ్


రావలమ్మపాలెంలో ఓటేసేందుకు బారులు తీరిన ఓటర్లు

సబ్బవరం, మే 19: మండలంలో గ్రామీణ ఓటర్లలో గతం కంటే చైతన్యం పెరిగింది. మండలంలో జీవీఎంసీ 88వ వార్డు కలుపుకొని 68 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. పైడివాడ 60 నంబరు బూత్‌లో అత్యధికంగా 96.34 శాతం, మర్రిపాలెం 12వ బూత్‌లో 95.93 శాతం, వంగలి(5)లో 93.35శాతం, ఎరుకునాయుడుపాలెం(57)లో 92.45 శాతం, గుల్లేపల్లి (17)లో 92.37 శాతం, రావలమ్మపాలెం (8)లో 92.29 శాతం, నారపాడు (52)లో 92.21 శాతం, ఎల్లుప్పి (11)లో 91.77శాతం, బాటజంగాలపాలెంలో 91.73 శాతం, పైడివాడఅగ్రహారం (63)లో 91.46 శాతం, గొటివాడ (41,42 పిఎస్‌లు)లో 91 శాతం, గాలిభీమవరం (43)లో 91 శాతం, రాయపుర అగ్రహారం(3)లో 90.60 శాతం, బుదిరెడ్ల మర్రిపాలెంలో 90.37 శాతం, టెక్కలిపాలెం (45)లో 90.17 శాతం, జాగారపువానిపాలెం (90)లో 90 శాతం ఓటింగ్ నమోదైంది. పట్టణ వాతావరణ కలిగిన జీవీఎంసీ 88వ వార్డు పరిధి 68వ వార్డులో అతి తక్కువగా 55.40 శాతం ఓట్లు నమోదయ్యాయి. చాలా పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంల్లో సాంకేతిక లోపం వలన ఓటింగ్ శాతం తగ్గింది, అందుకు కారణం పోలింగ్ కేంద్రాల్లో లైటింగ్ సమస్య, ఈవీఎంలు నెమ్మదిగా స్పందించడం, ఓటరు కనీసం 3 నుంచి 4 గంటలు క్యూలో ఉండడం వంటి కారణాల వలన పోలింగ్ శాతం తగ్గిందని రాజకీయ పార్టీల నేతలు అంటున్నారు. వచ్చే ఎన్నికలు నాటికి పోలింగ్ కేంద్రాలు సంఖ్య పెంచాలని వారు అభిప్రాయపడుతున్నారు.

నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిన పీవీజేఆర్

▸ కొనియాడిన పలువురు వక్తలు



సంతాప సభలో మాట్లాడుతున్న దాడి వీరభద్రరావు

కొత్తూరు, మే 19 : ఈనెల 14న మృతి చెందిన నూకాంబిక అమ్మవారి దేవస్థానం మాజీ చైర్మన్, వ్యాపారవేత్త, స్వచ్ఛంద సేవకులు దివంగత పీలా వెంకట జగ్గారావు (పీవీజేఆర్)కు పట్టణ ప్రజలు నివాళులర్పించారు. స్థానిక గౌరీ గ్రంథాలయంలో ఆదివారం సంతాపసభ జరిగింది. ఈ కార్యక్రమంలో పీవీజేఆర్ చిత్రపటానికి మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దాడి వీరభద్రరావు మాట్లాడుతూ ఎటువంటి అధికార పదవులు లేకపోయినా ఎంతో మంది నిరుపేదలకు ఉపాధి కల్పించిన మహనీయుడు జగ్గారావు అని పేర్కొన్నారు. తన ఆదాయంలో 50 శాతానికి పైగా సేవా కార్యక్రమాలకు వెచ్చించారన్నారు. అలాగే బుద్ద నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ చిన్నతనం నుంచి ఆర్థిక సమస్యలు, కష్టాలు తెలిసిన వ్యక్తిగా పేదల పెన్నిధిగా జగ్గారావు నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో జగన్నాథస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ దాడి ఈశ్వరరావు, గౌరీ గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, అధ్యక్షుడు దొడ్డి నూకఅప్పారావు, మాజీ కార్యదర్శి మళ్ల బాపునాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రబలిన సీజనల్ వ్యాధులు

▸ నక్కపల్లి ఆస్పత్రిలో పెరుగుతున్న ఓపీ



నక్కపల్లి ఆస్పత్రిలో ఓపీ వద్ద రోగుల క్యూ

నక్కపల్లి, మే 19: మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలాయి. జ్వరాలు, తలనొప్పి, దగ్గు, కాళ్లు, కీళ్ల నొప్పులు వంటి వ్యాధులతో నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లోని రోగులు నక్కపల్లి 50 పడకల ఆస్పత్రికి వస్తున్నారు. మండువేసవిలో కూడా నక్కపల్లి ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య ఎక్కువగా ఉంది. ఓపీ వద్ద రోగుల రద్దీ కనబడుతోంది. వ్యాధి తీవ్రత వున్న వారిని ఆస్పత్రి జనరల్ వార్డులో చేర్పించి వైద్య సేవలందిసస్తున్నారు. అవసరమైన వారికి ఆస్పత్రిలోనే రక్తపరీక్షలు కూడా చేస్తున్నారు. రోజుకు సగటున 250 మంది రోగులు ఆస్పత్రికి వస్తుండగా, వారిలో దాదాపు 40శాతం మంది సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నవారే కనబడుతున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఈశ్వరప్రసాద్ మాట్లాడుతూ.. వేసవి ఎండలతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. మసాలా లేని తేలిక పాటి ఆహారం, ఆకుకూరలు తీసుకోవడం మంచిదన్నారు. మంచి నీరు, కొబ్బరినీరు, గ్లూకోజ్, బార్లీ ,మజ్జిగ వంటి ద్రవ పదార్థాలు ఎక్కువ తీసుకోవాలన్నారు.

ఘనంగా గ్రీన్‌క్లబ్ దశాబ్ద వేడుకలు



ప్రదర్శనలో ఉంచిన వరి కంకులు

తుమ్మపాల, మే 19 : అనకాపల్లి పట్టణంలోని లయన్స్‌క్లబ్ సమావేశమందిరంలో ఆదివారం గ్రీన్‌క్లబ్ దశాబ్ద వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన హరిత వికాస్ ఫౌండేషన్‌కు చెందిన పర్యావరణవేత్త పాలుపర్తి దాలినాయుడు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు గ్రీన్‌క్లబ్ అందిస్తున్న సేవలను ప్రశంసించారు. ప్రతి నెలా మొక్కలు నాటడం, ఇంకుడు గుంతలు తవ్వడం, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలన, సేంద్రియ ఎరువులు, పక్షుల సంరక్షణ తదితర కార్యక్రమాలు గ్రీన్‌క్లబ్ ద్వారా జరగడం ఆనందదాయకమన్నారు. గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో ధాన్యపు కంకులను ప్రదర్శనలో ఉంచి అందరికీ అందజేశారు. పలువురు సిటిజెన్స్‌కు సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్‌క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్‌శ్రీధర్, ప్రముఖ సంఘ సేవకులు కర్రి సన్యాసినాయుడు, పెంటకోట ఉమామహేశ్వరరావు, బీరా వినోద్‌కుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.

కంటి వ్యాధుల నివారణపై అవగాహన

కొత్తూరు, మే 19 : అనకాపల్లి ఎన్‌టీఆర్ మార్కెట్ యార్డు గుమస్తాల సంఘం కార్యాలయంలో ఆదివారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ కంటి వ్యాధి నిపుణులు డాక్టర్ పరమేశ్వరరావు కంటి వ్యాధుల నివారణోపాయాలు అనే అంశంపై అవగాహన కల్పించారు. కంటి పట్ల నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి శుభ్రం చేసుకోవాలన్నారు. బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చినప్పుడు ముఖం పరిశుభ్రమైన నీటితో శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బీశెట్టి రామకృష్ణ, యల్లపు సాంబశివరావు, కోశాధికారి రాపేటి నారాయణరావు, డాక్టర్ డీడీ.నాయుడు, ఆడారి మల్లిఖార్జునరావు, కేవీ గౌరీపతి, ఆళ్ల ఓంరాం, సత్యనారాయణ, దేముళ్ళు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యంతో రొయ్యల పరిశ్రమ చెలగాటం

▸ ధర్మవరం అగ్రహారం రొయ్యల పరిశ్రమతో పొంచి వున్న ముప్పు
▸ వ్యర్థ జలాలను పక్క భూమిలో విడుదల చేస్తున్నవైనం
▸ హైవే పక్కనే చెరువును తలపిస్తున్న వ్యర్థ జలాలు
▸ దుర్వాసన తట్టుకోలేకపోతున్న వాహనదారులు



హైవేకు పక్కనే చెరువును తలపిస్తున్న రొయ్యల పరిశ్రమ వ్యర్థ జాలాలు

ఎస్.రాయవరం, మే 19: మండలంలోని ధర్మవరం అగ్రహారం వద్ద జాతీయ రహదారికి పక్కనే ఉన్న కోస్టల్ రొయ్యల పరిశ్రమ యాజమాన్యం ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతోంది. నిబంధనల ప్రకారం రొయ్యల పరిశ్రమలు జనాలు నివసించే ప్రాంతాలకు, జాతీయ రహదారులకు దూరంగా ఏర్పాటు చేయాలి. ఆ పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థ జలాలను రీసైక్లింగ్ పద్ధతిలో శుద్ధి చేసుకోవాలి. కానీ రొయ్యల పరిశ్రమ యాజమాన్యం వ్యర్థ జలాలను ఎక్కడ పడితే అక్కడ విడిచి పెడుతోంది. దీంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ వ్యర్థ జలాలు భూమిలో ఇంకడంతో భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని స్థానికులు తెలిపారు. అలాగే ఈ జలాల నుంచి వచ్చే దుర్వాసన భరించలేకపోతున్నామని వారంటున్నారు. ఈ దుర్గంధానికి రాత్రి వేళల్లో నిద్ర పట్టడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత దర్జాగా వ్యర్థ జలాలు విడిచిపెడుతున్నా సంబంధిత అధికారులు గానీ, రాజకీయ నాయకులు గానీ పట్టించుకోవడం లేదని వారు విమర్శిస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీవో సత్యనారాయణమూర్తి వద్ద ప్రస్తావించగా.. పజల ఆరోగ్యానికి హాని కలిగించే విధంగా రొయ్యల పరిశ్రమ యాజమాన్యం వ్యవహరించకూడదన్నారు. ఆ విధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికైన సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి రొయ్యల పరిశ్రమ నుంచి వ్యర్థ జలాలు బయటకు విడుదల చేయకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

నిప్పులు చెరిగిన భానుడు

▸ అల్లాడిపోయిన జనం
▸ ఇళ్ల నుంచి బయలకు రాని ప్రజలు..
▸ నిర్మానుష్యంగా మారిన ప్రధాన రోడ్లు, జంక్షన్‌లు..



నిర్మానుష్యంగా మారిన రాంబిల్లి ప్రధాన జంక్షన్



నిర్మానుష్యంగా ఉన్న ఎలమంచిలి ప్రధాన రోడ్డు

పరవాడ, మే 19: మండల కేంద్రం, పరిసర ప్రాంతాల్లో ఆదివారం భానుడు నిప్పులు చెరిగాడు. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండ తీవ్రత కొనసాగింది. ఎండ వేడిమి ధాటికి ఉదయం 11 గంటలకల్లా ప్రధాన రహదారులు నిర్మానుష్యమయ్యాయి. ఎండకు తోడు వేడిగాలులు వీయడంతో వృద్ధులు, చిన్నపిల్లలు అల్లాడిపోయారు. మూడు రోజులుగా భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. దీని కారణంగా నిత్యం రద్దీగా ఉండే మండల కేంద్రం సంతబయలు బోసిపోయింది. వివిధ పనులపై మండల కేంద్రానికి వచ్చే వారంతా ఎండకు భయపడి ఇళ్లకే పరిమితమవ్వడంతో వ్యాపార సముదాయాలన్నీ వెలవెలబోయాయి. దీని కారణంగా సంతబయలు వద్ద నిర్మానుష్య వాతావరణం నెలకొంది.

రాంబిల్లిలో.. సూరీడు ఆదివారం ఉగ్రరూపం దాల్చాడు. ఉదయం 7 గంటలు నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జనం సాహసించలేదు. ఇళ్లలోని ప్రతి వస్తువు వేడెక్కిపోయింది. ఒక పక్క వేడి తీవ్రత, మరో పక్క కరెంటు కోత ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వృద్ధులు, అనారోగ్యంతో బాధపడేవారు, చంటిపిల్లలు, గర్భిణులు అల్లాడిపోయారు. ఎండతీవ్రత వల్ల పశువులను మేతకు పంపడం లేదని, దీనివల్ల పాల దిగుబడి కూడా తగ్గిపోయిందని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం జనసంచారంతో రద్దీగా ఉండే ప్రధాన రోడ్లు, జంక్షన్లు నిర్మానుష్యంగా మారిపోయాయి.

ఎలమంచిలిలో... పట్టణంలో ఆదివారం ఎండ తీవ్రతకు జనం అల్లాడిపోయారు. ఆదివారం ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు తట్టుకోలేకపోయారు. మధ్యాహ్నం ఎండకు తోడు వేడిగాడ్పులు వీయడంతో జనం ఇళ్లకే పరిమితం కావాల్సి వచ్చింది. నిత్యం వినియోగదారులతో కళ కళలాడే వ్యాపార సముదాయాలు వెలవెలబోయాయి. జన సంచారం లేకపోవడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి.

పుచ్చలపల్లికి ఘన నివాళి



అనకాపల్లి టౌన్: సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



సబ్బవరంలో పుచ్చలపల్లి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి టౌన్, మే 19 : స్థానిక సీపీఎం జిల్లా కార్యాలయంలో కమ్యూనిస్టు ఉద్యమ నేత, సీపీఎం తొలి జాతీయ ప్రధానకార్యదర్శి పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుందరయ్య చిత్రపటానికి జిల్లా కార్యదర్శి కె. లోకనాథం పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆర్. శంకరరావు, జి. కోటేశ్వరరావు, అల్లు రాజు నివాళులు అర్పించారు.

పరవాడలో.. కమ్యూనిస్టు ముద్దుబిడ్డ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి కార్యక్రమాన్ని పరవాడ సినిమా జంక్షన్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత పుచ్చలపల్లి చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు జి. కోటేశ్వరరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొల్లి అప్పారావు, కొల్లి అప్పలనాయుడు, రమణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు. అలాగే పరవాడ ఊరచెరువు వద్ద ఉపాధి హామీ కూలీల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు వెంకటలక్ష్మి, కుమారి, అప్పలనర్సమ్మ, రాములమ్మ, సత్యవతి తదిరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో.. మండలంలోని కొరుప్రోలు, చినగుమ్ములూరు గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల సమక్షంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ పేదలకు సుందరయ్య అందించిన సేవలు, ఆయన చేసిన పోరాటాల గురించి ఉపాధి కూలీలకు వివరించారు.

రాంబిల్లిలో.. మండల కేంద్రంలో ఆదివారం సీపీఎం శ్రేణులు పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి సీపీఎం మండల కన్వీనర్ జి.దేముడునాయుడు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగమంత్రి నారాయణరావు, చింతకాయల శివాజీ, చందక రామకృష్ణ, రుత్తల రాంబాబు, వాసు, శ్రీను పాల్గొన్నారు.

సబ్బవరంలో.. సీపీఎం తొలి జాతీయ ప్రధాన కార్యదర్శి పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. సీపీఎం నాయకురాలు ఉప్పాడ సత్యవతి, ముఠా కార్మికుల నాయకుడు బర్ల రమణ సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ కార్యకర్తలు, ముఠా కార్మికులు పాల్గొన్నారు.

సమ్మర్ హాకీ శిబిరం ప్రారంభం



హాకీ శిక్షణ పొందుతున్న బాలికలు

నక్కపల్లి, మే 19: జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆదేశాల మేరకు బీఎస్ హాకీ క్లబ్ ఆధ్వర్యంలో నక్కపల్లిలో సమ్మర్ హాకీ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరాన్ని డీఎస్‌డీవో వెంకటరమణ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన హాకీ శిక్షణ పొందుతున్న బాల,బాలికలకు పలు సూచనలు చేశారు. హాకీ వల్ల చక్కని ఆరోగ్యమే కాకుండా విద్యాఉద్యోగాల్లో మంచి అవకాశాలు లభిస్తాయని చెప్పారు.ఈ శిక్షణను సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. బీఎస్ హాకీ క్లబ్ ప్రతినిధులు సూరిబాబు, తాతాజీ, చిన్న అప్పారావు, రామచంద్రరావు, తాతాజీ, నానాజీల కృషిని ఆయన అభినందించారు. కోచ్ రాంబాబు పర్యవేక్షణలో జూన్ నెల రెండో వారం వరకూ ఈ శిక్షణ కొనసాగుతుందని ఆయన చెప్పారు.

ఎయిడ్స్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



ఎయిడ్స్ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తుమ్మపాల, మే 19 : ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ ఎంఎస్‌వీకే బాలాజీ పేర్కొన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ దీప స్మృత్యాంజలి దినోత్సవం సందర్భంగా ఆదివారం ఎయిడ్స్ వ్యాధిపై ఎన్టీఆర్ వైద్యాలయం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలాజీ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల ప్రతి ఒక్కరూ ఆదరణ భావం కలిగి ఉండాలన్నారు. వ్యాధిగ్రస్తులు క్రమంగా మందులు వాడుతూ ప్రశాంత జీవితాన్ని కొనసాగించాలని సూచించారు. అనంతరం ఎయిడ్స్ వ్యాధి బారిన పడి మరణించిన వారికి కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ప్రియదర్శిని, సీహెచ్. స్పందన, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారికి ఘనంగా పంచామృతాభిషేకం

పాయకరావుపేట రూరల్, మే19: మండలంలోని మంగవరం పద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న ద్వాదశి వార్షిక తిరుకల్యాణ మహోత్సవాలలో భాగంగా ఆదివారం వేద పండితులు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం అగ్నిహోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు తమిడిశెట్టి బసవరాజు, తమిడిశెట్టి అయ్యారావుల ఆధ్వర్యంలో స్వామి వారికి పూజలు చేశారు. స్వామి వారిని భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

గోవాడలో ఉద్రిక్తత

... 5వ పేజీ తరువాయి

తెలిసి జనసేన నాయకులు కూడా అక్కడకు చేరుకుని ఉపాధి కూలీలను అడ్డుకున్నారు. ఉపాధి పనుల్లో అవకతవకలపై విచారణ జరిపించాలని తాము కోరుతున్నామని, దీనిపై విచారణ జరపకుండా వైసీపీ నాయకులు రాజకీయ దురుద్దేశంతో రెచ్చగొట్టి అనవసరంగా తమ ఇళ్ల వద్దకు పంపించి గొడవలకు ప్రోత్సహించడం ఏమిటని టీడీపీ, జనసేన నాయకులు కూలీలతో వాదనకు దిగారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తి తోపులాట చోటుచేసుకుంది. టీడీపీ నాయకులు పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐలు గోవాడ చేరుకుని ఉపాధి కూలీలు, టీడీపీ నేతలతో చర్చలు జరిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎలాంటి వివాదాలకు తావు ఇవ్వరాదని, అలా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతో వివాదం సద్దుమణిగింది. ఉపాధి కూలీలు కూడా టీడీపీ నాయకుడు లక్ష్మణ్‌కుమార్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వివాదంపై జనసేన నాయకులు మాట్లాడుతూ ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతో వైసీపీ నాయకులు ఈ విధమైన రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్నారని, దీనికి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. వివాదం నేపథ్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులేవి?

... 5వ పేజీ తరువాయి

సాగించేవారు. అయితే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ దశలో ఉన్నప్పుడు బ్రిడ్జితో పాటు రైల్వే గేటును ఆర్టీసీ అధికారులు సాకుగా చూపి ఎక్స్‌ప్రెస్ సర్వీసుల రాకపోకలను ఎలమంచిలి పట్టణం వైపు నిలిపివేశారు. దీంతో అప్పటి నుంచి ఎలమంచిలి బస్టాండ్ కేవలం పల్లెవెలుగు, మెట్రో బస్సులకు మాత్రమే పరిమితమైపోయింది. రెండు నెలల క్రితం ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రారంభమై వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. బ్రిడ్జి పూర్తయిన వారం రోజుల్లో అన్ని ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఎలమంచిలి వస్తాయని నేతలు ఇచ్చిన హామీ మాత్రం నెరవేరలేదు. దూర ప్రాంతాల నుంచి వచ్చేటప్పుడు ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు అదనపు చార్జీ చెల్లించి బైపాస్ రోడ్డులో దిగాల్సి వస్తోందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎలమంచిలి బస్టాండ్‌కు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

దీర్ఘకాలిక వ్యాధులపై ఇంటింటి సర్వే

... 5వ పేజీ తరువాయి

కేన్సర్ స్క్రీనింగ్ చేయడానికి అధిక ప్రాధాన్యతనిచ్చేలా ఆదేశాలు అందాయని ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు.

అదుపు చేయడంపైనే దృష్టి..

ఇటీవల దీర్ఘకాలిక వ్యాధుల బారినపడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ముఖ్యంగా చిన్న వయసు లోనే షుగర్, బీపీ వంటి సమస్యలు చుట్టుముట్టడం, కేన్సర్ మహమ్మారి విజృంభిస్తుండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. సకాలంలో కొన్ని దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించడం ద్వారా ప్రాణాపాయం నుంచి రోగులను తప్పించేందుకు అవకాశం ఉంటుంది. ఈ ఉద్దేశంతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సర్వేను చేపడుతున్నాయి. దీని ద్వారా వీలైనంత వరకు దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడే వారిని ముందుగానే గుర్తించి, మెరుగైన వైద్యసేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు తెలిపారు. ఈ సర్వేతో అనారోగ్య సమస్య ఉందని తెలియని ఎంతోమందిని గుర్తించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆశా, ఏఎన్ఎం, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్, మెడికల్ ఆఫీసర్లకు శిక్షణ ఇచ్చేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నామని డీఎంహెచ్‌వో వివరించారు.

ఉమాధర్మలింగేశ్వర స్వామిని దర్శించుకున్న అనిత



స్వామివారిని దర్శించుకుంటున్న అనిత

పాయకరావుపేట రూరల్, మే 19: తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత ఆదివారం గోపాలపట్నం సీతమ్మవారి కొండపై కొలువైన ఉమాధర్మలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నానన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వంగలపూడి అనితను సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, ఎంపీటీసీ సభ్యుడు సతీష్‌రాజు, టీడీపీ నాయకులు యాళ్ల వరహాలు, దంతులూరి గోపిరాజు, గణపర్తి దొరబాబు, రాజుబాబు, కోనేటి చంద్రమౌళి, చంటిరాజు, బాబారాజు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



బొజ్జన్నకొండ వద్ద కలిసిన పూర్వ విద్యార్థులు

తుమ్మపాల, మే 19 : పట్టణంలోని గవరపాలెం మున్సిపల్ చిన హైస్కూల్‌లో 1993-94 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం బొజ్జన్నకొండ వద్ద కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆటపాటలతో ఆనందంగా గడిపారు. అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. వృత్తి, వ్యాపారరీత్యా విదేశాల్లో స్థిరపడిన వారు సైతం ఆత్మీయ కలయికలో పాల్గొని ఒకరి యోగక్షేమాలు మరొకరు తెలుసుకున్నారు. అందరూ కలిసి విందు భోజనం చేశారు. ప్రతి ఏటా కలుసుకోవాలని తీర్మానించుకోవడంతో పాటు అవకాశమున్న మేరకు సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో బ్యాచ్ విద్యార్థులు కాండ్రేగుల రామలింగేశ్వరరావు, జగన్నాథరావు, విల్లూరి ప్రసాద్, కాండ్రేగుల భాను, పెంటకోట పూర్ణచంద్రరావు, బత్తుల నూకేష్,ఆళ్ల శివాజీ, అర్రెపు కాశీ, షేక్ చాంద్‌భాషా పాల్గొన్నారు.

24 నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

సబ్బవరం, మే 19: ఈనెల 24 నుంచి ఏడు రోజులు పాటు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని ఎంఈవో-2 బి.సూర్యనారాణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సప్లిమెంటరీ పరీక్షలు 120 మంది రాస్తున్నారన్నారు. ప్రతి రోజూ ఉదయం 9.30 గంటల నుంచి 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఆదివారం ప్రశ్నపత్రాలు స్థానిక పోలీసు స్టేషన్‌లో పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ రొంగలి ప్రసాద్ సమక్షంలో డిపాజిట్ చేశారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

పాయకరావుపేట, మే 19: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖనంతో పాటు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. అదేవిధంగా సుందరకాండ, నీతి కథలు వినిపించారు. యోగా, పుస్తక పఠనం, స్పోకెన్ ఇంగ్లీషు, మాథ్స్ ట్రిక్స్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ తరగతుల్లో ఇన్‌చార్జి లైబ్రేరియన్ వామాల లక్ష్మణరావు, విశ్రాంత ఉపాధ్యాయులు ఎస్.సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

160 మంది రోగులకు కంటి పరీక్షలు



రోగులను తనిఖీ చేస్తున్న వైద్యులు

కశింకోట, మే 19 : స్థానిక శివాలయం వద్ద ఉన్న హైస్కూలోలో ఆదివారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 160 మంది రోగులకు పరీక్షలు చేశారు. విశాఖ శంకర్ ఫౌండేషన్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, జిల్లా హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ మధు సత్యశ్రీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యులు పరీక్షించిన 160మందిలో 90 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. మిగిలిన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ ఫౌండర్ కార్యదర్శి ఎం.శ్యాంప్రసాద్, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎస్వీ రమణ, పుట్ట మురళీకృష్ణ, రవి, శివనాయుడు పాల్గొన్నారు.

గ్రామస్థులు సామరస్యపూర్వకంగా మెలగాలి

▸ పరవాడ డీఎస్‌పీ సత్యనారాయణ



సోమలింగపాలెంలో మాట్లాడుతున్న డీఎస్‌పీ సత్యనారాయణ

ఎలమంచిలి, మే 19: గ్రామాల్లో ప్రజలంతా శాంతి పూర్వక వాతావరణంలో ఉండాలని, రానున్న కౌంటింగ్ దృష్ట్యా ప్రతి ఒక్కరూ సామరస్య పూర్వకంగా మెలగాలని పరవాడ డీఎస్పీ సత్యనారాయణ గ్రామస్థులకు సూచించారు. ఆదివారం మునిసిపాలిటీలోని సోమలింగపాలెం వార్డులో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికలు జరిగిన తర్వాత అందరూ కలిసి మెలిసి ఉండాలని హితవు పలికారు. అదే విధంగా సీఐ షేక్ గఫూర్ మేజర్ పంచాయతీ ఏటికొప్పాక గ్రామాన్ని సందర్శించి గ్రామస్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల దృష్ట్యా ప్రజలంతా సంయమనంతో ఉండాలని, ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో ప్రజలంతా సోదర భావంతో మెలగాలన్నారు. అన్ని రాజకీయ పార్టీల నేతలు సహకరించాలన్నారు.

అంగరంగ వైభవంగా సామూహిక అష్టదళ పద్మాల సేవ

ఎలమంచిలి, మే 19 : పట్టణంలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం 108 దంపతులతో సామూహికంగా అష్టదళ పద్మాల సేవ, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి 51 వ వార్షికోత్సవంలో భాగంగా ఐదు రోజులు పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారి పల్లకి ఊరేగింపులో నిర్వహించిన మహిళల కోలాటాలు ఆద్యంతం అలరించాయి. అంతకుముందు రంగాచిన వెంకటస్వామి దంపతులచే ద్విముఖ గణపతి పూజా కార్యక్రమం, నేతి వాసు, భారతి దంపతుల ఆర్థిక సాయంతో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఇరు శాఖలకు పట్టని మదుం..

ఇబ్బందుల్లో జనం

▸ శిథిలావస్థకు చేరడంతో వాహనదారుల్లో భయం..భయం..



జోగంపేట వద్ద బ్రిటీష్ కాలంలో ధారగెడ్డపై నిర్మించిన మదుం



ప్రధాన రహదారిలో శిథిలావస్థకు చేరిన మదుం

గొలుగొండ, మే 19 : నర్సీపట్నం- కృష్ణాదేవిపేట వెళ్లే ప్రధాన రహదారిలో ఓ చోట గల మదుం ప్రమాదకరంగా మారింది. ఇది శిథిలావస్థకు చేరుకోవడంతో వాహన చోదకలు ఆందోళన చెందుతున్నారు. ఈ మదుం ఏ శాఖ పరిధిలోకి వస్తుందో తెలియక ఇటు ఇరిగేషన్, అటు ఆర్అండ్‌బీ శాఖలు పట్టించుకోవడం మానేశాయి. ఇందుకు సంబంధించిన వివరాలివి. నర్సీపట్నం- కృష్ణాదేవిపేట వెళ్లే ప్రధాన రహదారిలో జోగంపేట వద్ద బ్రిటీష్ కాలంలో ధారగెడ్డపై మదుం నిర్మించారు. నాటి నుంచి నిత్యం ఈ రహదారి వాహనదారులతో రద్దీగా ఉంటుంది. ధారగెడ్డ, గోకిగెడ్డ, రాళ్ల గెడ్డ ద్వారా వచ్చే నీరు ఈ మదుం నుంచి తాండవ రిజర్వాయర్‌లోకి చేరుతుంది. ఐదేళ్ల క్రితం ఈ మదుం శిథిలావస్థకు చేరుకుంది. అంతేకాకుండా ఇది కనిపించని విధంగా ఇరుపక్కల పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. దీంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదిలావుంటే, ఈ మదుం ఇరిగేషన్ శాఖ పరిధిలోకి వస్తుందా.. లేక రోడ్లు భవనాల శాఖ పరిధిలోకి వస్తుందో తెలియక రెండుశాఖల అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు అంటున్నారు. అలాగే వర్షాలు కురిసేటప్పుడు మదుం నుంచి గెడ్డల నీరు వెళ్లకపోవడంతో రోడ్డుపైకి చేరుతుండడం వల్ల వాహనదారులు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు వాపోతున్నారు. దీనికితోడు ఈ మదుం ప్రాంతం ఇరుకుగా ఉండడం వల్ల ఎదురెదురుగా వచ్చే వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్తగా మదుం నిర్మించాలని పలువురు కోరుతున్నారు. ఇదిలావుంటే, ఈ సమస్యను ఆర్అండ్‌బీ జేఈ ప్రసాద్ వద్ద ప్రస్తావించగా, ఈ మదుం ఇరిగేషన్ శాఖ పరిధిలోకి వస్తుందన్నారు. అలాగే, ఇరిగేషన్ జేఈ సూర్య దృష్టికి తీసుకు వెళ్లగా ఈ మదుం తమశాఖకు సంబంధించినదిగా తన దృష్టికి రాలేదన్నారు. ఏదిఏమైనా నిధుల మంజూరుకు త్వరలో ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని వివరించారు.

ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులేవి?

... 5వ పేజీ తరువాయి

సాగించేవారు. అయితే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ దశలో ఉన్నప్పుడు బ్రిడ్జితో పాటు రైల్వే గేటును ఆర్టీసీ అధికారులు సాకుగా చూపి ఎక్స్‌ప్రెస్ సర్వీసుల రాకపోకలను ఎలమంచిలి పట్టణం వైపు నిలిపివేశారు. దీంతో అప్పటి నుంచి ఎలమంచిలి బస్టాండ్ కేవలం పల్లెవెలుగు, మెట్రో బస్సులకు మాత్రమే పరిమితమైపోయింది. రెండు నెలల క్రితం ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రారంభమై వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. బ్రిడ్జి పూర్తయిన వారం రోజుల్లో అన్ని ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఎలమంచిలి వస్తాయని నేతలు ఇచ్చిన హామీ మాత్రం నెరవేరలేదు. దూర ప్రాంతాల నుంచి వచ్చేటప్పుడు ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు అదనపు చార్జీ చెల్లించి బైపాస్ రోడ్డులో దిగాల్సి వస్తోందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎలమంచిలి బస్టాండ్‌కు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

దీర్ఘకాలిక వ్యాధులపై ఇంటింటి సర్వే

... 5వ పేజీ తరువాయి

కేన్సర్ స్ర్కీనింగ్ చేయడానికి అధిక ప్రాధాన్యతనిచ్చేలా ఆదేశాలు అందాయని ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు.

అదుపు చేయడంపైనే దృష్టి..

ఇటీవల దీర్ఘకాలిక వ్యాధుల బారినపడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ముఖ్యంగా చిన్న వయసు లోనే షుగర్, బీపీ వంటి సమస్యలు చుట్టుముట్టడం, కేన్సర్ మహమ్మారి విజృంభిస్తుండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. సకాలంలో కొన్ని దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించడం ద్వారా ప్రాణాపాయం నుంచి రోగులను తప్పించేందుకు అవకాశం ఉంటుంది. ఈ ఉద్దేశంతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సర్వేను చేపడుతున్నాయి. దీని ద్వారా వీలైనంత వరకు దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడే వారిని ముందుగానే గుర్తించి, మెరుగైన వైద్యసేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు తెలిపారు. ఈ సర్వేతో అనారోగ్య సమస్య ఉందని తెలియని ఎంతోమందిని గుర్తించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆశా, ఏఎన్ఎం, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్, మెడికల్ ఆఫీసర్లకు శిక్షణ ఇచ్చేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నామని డీఎంహెచ్‌వో వివరించారు.

గోవాడలో ఉద్రిక్తత

... 5వ పేజీ తరువాయి

తెలిసి జనసేన నాయకులు కూడా అక్కడకు చేరుకుని ఉపాధి కూలీలను అడ్డుకున్నారు. ఉపాధి పనుల్లో అవకతవకలపై విచారణ జరిపించాలని తాము కోరుతున్నామని, దీనిపై విచారణ జరపకుండా వైసీపీ నాయకులు రాజకీయ దురుద్దేశంతో రెచ్చగొట్టి అనవసరంగా తమ ఇళ్ల వద్దకు పంపించి గొడవలకు ప్రోత్సహించడం ఏమిటని టీడీపీ, జనసేన నాయకులు కూలీలతో వాదనకు దిగారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తి తోపులాట చోటుచేసుకుంది. టీడీపీ నాయకులు పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐలు గోవాడ చేరుకుని ఉపాధి కూలీలు, టీడీపీ నేతలతో చర్చలు జరిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎలాంటి వివాదాలకు తావు ఇవ్వరాదని, అలా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతో వివాదం సద్దుమణిగింది. ఉపాధి కూలీలు కూడా టీడీపీ నాయకుడు లక్ష్మణ్‌కుమార్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వివాదంపై జనసేన నాయకులు మాట్లాడుతూ ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతో వైసీపీ నాయకులు ఈ విధమైన రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్నారని, దీనికి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. వివాదం నేపథ్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మోదకొండమ్మ జాతర చాటింపు

▸ 21న శతకంపట్టు వద్ద అమ్మవారి కొలువు ▸ వచ్చే నెల 18న ప్రధాన పండగ ▸ పెద్ద సంఖ్యలో భక్తులు మాలధారణ



ఆలయంలో కొలువుదీరిన మోదకొండమ్మ



పసుపు కుంకుమలతో పూజలు జరుపుతున్న భక్తులు



అమ్మవారి మాలలు ధరిస్తున్న భక్తులు

మాడుగుల, మే 19 : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత మాడుగుల మోదకొండమ్మ జాతరకు సంబంధించి ఆదివారం ఉదయం చాటింపు వేశారు. కమిటీ ఆధ్వర్యంలో తొలుత ఆలయ ప్రాంగణంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జూన్ 18వ తేదీ మంగళవారం ఈ వేడుక జరగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను కూడా ప్రారంభించారు. ఈ నెల 21వ తేదీ మంగళవారం ఉదయం ఘటాలతో భారీ ఊరేగింపుగా బయల్దేరి శతకంపట్టు వద్ద అమ్మవారిని కొలువు దీర్చనున్నామని ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు. భక్తులంతా అమ్మవారిని దర్శించుకుని, పసుపు కుంకుమలను సమర్పించుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కుప్పిలి భవానీ శంకర్, కొట్యాడ మల్లికార్జునరావు, బలిరెడ్డి అప్పలరాజు, తాతీలు తదితరులు పాల్గొన్నారు. జాతరను పురస్కరించుకుని 60 మంది భక్తులు మోదకొండమ్మ మాలధారణ చేశారు. అర్చకులు శ్రీనివాసరావు పర్యవేక్షణలో గురుమాతలు బత్తుల మూర్తి, కొర్ని శంకరరావు, పల్లా సత్తిబాబులు పూజల అనంతరం భక్తులతో మాలధారణ చేయించారు. వీరందరికీ కమిటీ సభ్యులు అమ్మ వారి ప్రతిమ కలిగిన మాలలను ఉచితంగా అందజేశారు. ఇదిలావుంటే, అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి వీరి సందడి ఆరంభమైంది. తొలుత అమ్మవారికి విశేష పూజల అనంతరం భక్తులకు దర్శనభాగ్యాన్ని కల్పించారు. కుటుంబాలతో సహా వచ్చిన కొందరు ఆ ప్రాంగణంలో వంటలు వండుకుని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించిన అనంతరం ఆరగించారు. స్థానిక న్యాయవాదులు శ్రీనాథ ప్రసాదరావు, ప్రమోద్‌లు భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.



శివ కేశవ ఆలయాల ఆవరణలో కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

శివకేశవ ఆలయాల్లో కల్యాణోత్సవాలు

రావికమతం, మే 19 : మండలంలోని కొత్తకోటలో గల శివకేశవ స్వామివార్ల ఆలయాల్లో శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామి, రాజరాజేశ్వరి సమేత రాజలింగేశ్వరస్వామి వార్ల వార్షిక కల్యాణోత్సవాన్ని ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా ఒకే వేదికపై ఈ కల్యాణాలను జరిపించారు. ఆలయాల కమిటీల చైర్మన్లు గుమ్ముడు దొరబాబు, పెనుగొండ మల్లేశ్వరరావు దంపతుల చేతులమీదుగా దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ వేడుకను జరిపారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి ఈ అపురూప ఘట్టాన్ని తిలకించి తరించారు. ఈ నెల 23వ తేదీ గురువారం సదస్యోత్సవం నిర్వహిస్తామని ఆలయ ప్రధాన అర్చకులు ఆర్.విజయభాస్కర్, ఎస్ఆర్ఎల్‌జీ శాస్త్రి తెలిపారు. ఈ కల్యాణోత్సవంలో భాగంగా ఆలయాల ప్రాంగణంలో మధ్యాహ్నం అన్నసమారాధనను ఏర్పాటు చేశారు. దేవదాయ శాఖ ఈవో ఆశాకిరణ్మయి, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా సర్వమంగళాదేవి, రామలింగేశ్వర కల్యాణం



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

బుచ్చెయ్యపేట, మే 19 : వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా ఆదివారం వడ్డాదిలో కొలువుదీరిన సర్వమంగళాదేవి, రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు రాంపల్లి నవీన్, దొంతికుర్తి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో దొండా గణేష్, దేవి దంపతులచే ఈ వేడుకను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది దంపతులు శివపార్వతుల నామ స్మరణలతో ఆలయ ప్రాగణం మార్మోగింది. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి దర్శించుకున్నారు.

అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలకు వితరణ



నగదు అందిస్తున్న సత్యనారాయణ

బుచ్చెయ్యపేట, మే 19 : అసంపూర్తిగా నిలిచిన రెండిళ్ల నిర్మాణాలకు ఆదివారం విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ రూ.70వేలను వితరణగా అందచేశారు. బుదిరెడ్లపాలేనికి చెందిన శొంఠ్యాన ఆచారి, యెన్నెంశెట్టి వాసులు ఆర్థిక లేమితో ఇంటి నిర్మాణాలు అసంపూర్తి స్థాయిలో నిలిచిపోయాయి. ఆర్థిక సహాయం అందజేయాలన్న వారి అభ్యర్థనల మేరకు సత్యనారాయణ వితరణగా నగదు అందజేశారు.

గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

▸ చెట్టుపల్లి, వేములపూడి సమావేశాల్లో సీఐ హరి హెచ్చరిక

▸ రావికమతం మండలంలో పోలీసు బలగాల కవాతు



చెట్టుపల్లిలో గ్రామస్థులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ హరి



చినపాచిల గ్రామంలో కేంద్ర పోలీసు బలగాల కవాతు

నర్సీపట్నం అర్బన్, మే 19 : సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వచ్చే నెల నాలుగో తేదీన ప్రకటించే వరకు అన్నిచోట్ల 144వ సెక్షన్ అమలులో ఉంటుందని, గ్రామాల్లో ప్రజలు ఎటువంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా ఉండాలని నర్సీపట్నం రూరల్ సీఐ బి.హరి సూచించారు. మండలంలోని చెట్టుపల్లి, వేములపూడి తదితర గ్రామాల్లో ఆదివారం సమావేశాలు ఏర్పాటు చేశారు. రాజకీయాలు ఎన్నికల వరకు మాత్రమే ఉండాలన్నారు. ఆ తరువాత అంతా స్నేహభావంతో కలిసిమెలిసి గ్రామాభివృద్ధికి పాటుపడాలన్నారు. అనవసరంగా గొడవలు పడి కేసుల్లో ఇరుక్కుని భవిష్యత్తును పాడుచేసుకోవద్దని సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను అతిక్రమంచేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంటన ఎస్ఐ భీమరాజు, సిబ్బంది ఉన్నారు.

రావికమతం : గ్రామాల్లో అంతా స్నేహభావం, సోదరభావంతో మెలగాలని ఎస్ఐ ధనుంజయనాయుడు సూచించారు. చినపాచిల, రావికమతం, గర్నికం, మేడివాడ గ్రామాల్లో ఆదివారం కేంద్ర పోలీసు బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు ముగిసినప్పటికీ జూన్ నాలుగో తేదీన ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు అన్నిచోట్ల 144వ సెక్షన్ అమలులో ఉందన్నారు. ఈ దృష్ట్యా గ్రామాలలో ఎటువంటి అల్లర్లు, హింసాత్మక ఘటనలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులతో పాటు కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.

మాకవరపాలెంలో పూర్వ విద్యార్థులు సందడి

మాకవరపాలెం, మే 19 : మండల కేంద్రం మాకవరపాలెం హైస్కూల్‌లో పూర్వ విద్యార్థులు ఆదివారం సందడి చేశారు. 2002- 2003 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వీరంతా వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపారుల్లో స్థిరపడ్డారు. ముందుగా నిర్ణయించుకున్న ప్రకారం పాఠశాలకు ఉదయం చేరుకోగానే వారిలో కళ్లల్లో ఆనందం వెల్లివిరిసింది. తొలుత ఒకరినొకరు ఆప్యాయంగా పలుకురించున్నారు. నాటి జ్ఞాపకాలను కాసేపు జ్ఞప్తికి తెచ్చుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాల అనంతరం సాయంత్రం వరకు సరదాగా గడిపారు.



హైస్కూల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

వెంకన్న ఆలయంలో లక్ష తులసి పూజ



పూజల్లో పాల్గొన్న భక్తులు

రోలుగుంట, మే 19 : మండల కేంద్రం రోలుగుంటలో కొండపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సామూహిక లక్ష తులసి పూజను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వైశాఖ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని జరిపినట్టు ఆలయ అర్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామికి పంచామృత అభిషేకాలు, విశేష పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

ఎం.కోడూరులో అమ్మవారి వేడుక



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మాడుగుల రూరల్ : మండలంలోని ఎం.కోడూరులో గ్రామ దేవత మోదకొండమ్మ పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి ఆలయంలో విశేష పూజలు ప్రారంభమయ్యాయి. మహిళలు ఘటాలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించారు. సాయంత్రం పలు ఆధ్యాత్మిక సాంస్కృతి కర్యక్రమాలు ఏర్పాటయ్యాయి. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మాడుగుల మండలంలో మోస్తరు వర్షం

మాడుగుల రూరల్, మే19 : వాతావరణంలో మార్పుల కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ మండినప్పటికీ సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఆకాశం మేఘావృతమై చిరు గాలులతో వర్షం పడింది. అంతటా ఒక్కసారిగా చల్లబడడంతో ఉపశమనం పొందారు.

'పోరాట యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య'



సుందరయ్య చిత్రపటం వద్ద సీపీఎం శ్రేణుల నివాళి

దేవరాపల్లి, మే 19 : మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అనేక పోరాటాలు చేసిన మహోన్నతుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న అన్నారు. మండలంలోని వాలాబు గ్రామంలో ఆదివారం సుందరయ్య వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన వ్యక్తి సుందరయ్య అని కొనియాడారు. అనంతరం పార్టీ జెండాను ఎగుర వేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి బి.టి.దొర, సిహెచ్.లక్ష్మణ, కె.సన్యాసి, జె.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

గొలుగొండ, మే 19 : ఇక్కడి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఆదివారం గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వరంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గొలుగొండ, జోగంపేట, కొత్తమల్లంపేట గ్రామాలకు చెందిన విద్యార్థులు ఇరవై మంది వరకు ఉత్సాహంగా హాజరయ్యారు.

24 నుంచి టెన్త్ అడ్వాన్స్ సప్లిమెంటరీ

సబ్బవరం, మే 19: ఈనెల 24 నుంచి ఏడు రోజులు పాటు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని ఎంఈవో-2 బి.సూర్యనారాణమూర్తి తెలి పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సప్లిమెంటరీ పరీక్షలు 120 మంది రాస్తున్నారన్నారు. ప్రతి రోజూ ఉదయం 9.30 గంటల నుంచి 12.45 గంటల వరకు పరీక్షలు జరుగు తాయన్నారు. ఆదివారం ప్రశ్నపత్రాలు స్థానిక పోలీసు స్టేషన్‌లో పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ రొంగలి ప్రసాద్ సమక్షంలో డిపాజిట్ చేశారు.

శ్రీవారికి ఘనంగా పంచామృతాభిషేకం

పాయకరావుపేట రూరల్, మే19: మండలంలోని మంగవరం పద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న ద్వాదశి వార్షిక తిరుకల్యాణ మహోత్సవాలలో భాగంగా ఆదివారం వేద పండితులు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం అగ్నిహోమం ఘనంగా నిర్వహించారు.

ఎన్నికల్లో కూటమి విజయం తథ్యం

▸ చోడవరం టీడీపీ అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు



కొమరవోలు గ్రామ టీడీపీ శ్రేణులతో ఎమ్మెల్యే అభ్యర్థి రాజు

రోలుగుంట, మే 19 : సార్వత్రిక ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో మండలంలోని కొమరవోలు గ్రామానికి చెందిన టీడీపీ శ్రేణులు ఆదివారం కూటమి నుంచి చోడవరం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన కేఎస్ఎన్ఎస్ రాజును ఇక్కడ కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారితో సమావేశమయ్యారు. జూన్ నాలుగో తేదీన ఓట్ల లెక్కింపు జరగుతుందని, కూటమి విజయం తథ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కొమరవోలులో ఎన్నడూలేని విధంగా ఈసారి ప్రజలంతా అత్యధికంగా కూటమికి మద్దతు పలికినట్టు వారంతా రాజుకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోతల శ్రీనివాసరావు, బోళెం రమేష్, తానారి శ్రీనివాసరావు, బండారు దొరబాబు, కోడి దేముడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రబలిన సీజనల్ వ్యాధులు

▸ నక్కపల్లి ఆస్పత్రిలో పెరుగుతున్న ఓపీ

▸ అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచన



నక్కపల్లి ఆస్పత్రిలో ఓపీ వద్ద రోగుల క్యూ

నక్కపల్లి, మే 19: మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలాయి. జ్వరాలు, తలనొప్పి, దగ్గు, కాళ్లు, కీళ్ల నొప్పులు వంటి వ్యాధులతో నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లోని రోగులు నక్కపల్లి 50 పడకల ఆస్పత్రికి వస్తున్నారు. మండువేసవిలో కూడా నక్కపల్లి ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య ఎక్కువగా ఉంది. ఓపీ వద్ద రోగుల రద్దీ కనబడుతోంది. వ్యాధి తీవ్రత వున్న వారిని ఆస్పత్రి జనరల్ వార్డులో చేర్పించి వైద్య సేవలందిసస్తున్నారు. అవసరమైన వారికి ఆస్పత్రిలోనే రక్తపరీక్షలు కూడా చేస్తున్నారు. రోజుకు సగటున 250 మంది రోగులు ఆస్పత్రికి వస్తుండగా, వారిలో దాదాపు 40శాతం మంది సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నవారే కనబడుతున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఈశ్వర్‌ప్రసాద్ మాట్లాడుతూ.. వేసవి ఎండలతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. మసాలా లేని తేలిక పాటి ఆహారం, ఆకు కూరలు తీసుకోవడం మంచిదన్నారు. మంచి నీరు, కొబ్బరినీరు, గ్లూకోజ్, బార్లీ ,మజ్జిగ వంటి ద్రవ పదార్థాలు ఎక్కువ తీసుకోవాలన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యం కావాలి

▸ జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కృష్ణ



సమావేశంలో పాల్గొన్న పార్టీ శ్రేణులతో కృష్ణ

మాడుగుల రూరల్, మే 19 : ఇక్కడి ఘాట్‌రోడ్డు జంక్షన్‌లోని జనసేన కార్యాలయం వద్ద ఆదివారం ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త రాయపురెడ్డి కృష్ణ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో జనసైనికులు ఎంతో కష్టపడి పనిచేశారన్నారు. ఇదే ఉత్సాహంతో గ్రామగ్రామాన పార్టీ బలోపేతమే లక్ష్యంగా అంతా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జీవీమూర్తి, దాసరి అచ్యుతరావు, రామకృష్ణ, కోన శ్రీనివాసు, రాజు, గణేష్‌లతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.